ఖరహరప్రియ - ఆది

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమున కళలెల్ల - మొలచినట్లుండె

జగదేకపతిమేన జ - ల్లిన కర్పూరధూళి
జిగిగొని నలు వంక - జిందగాను
మొగి చంద్రముఖి నుర - ముననిలిపెగనుక
పొగరు వెన్నెలదిగ - బోసినట్లుండె

పొరిమెరుగు జెక్కుల - బూసిన తట్టు పునుగు
కరగియిరుదెసల - కారగాను
కరిగమనవిభుడు - గనుక మోహమదము
తొరగి సామజసిరి - దొలకినట్లుండె

మెరయు శ్రీ వేంకటేశు - మేన సింగారముగాను
తరచైన సొమ్ములు - ధరియించగాను
మెరుగు బోడి అల - మేలు మంగయుదాను
మెరుపు మేఘముగూడి - మెరసినట్లుండె

శుక్రవారాభిషేక సమయంలో స్వామి దర్శనం ఎంతో మనోరంజకంగా చిత్రించారు ఈ సంకీర్తనలో అన్నమాచార్యులు. ఆ స్వామి దర్శనానందం ఎలా ఉన్నది? ఒకసారి చూసినదానికన్నా రెండవసారి ఆయన ముఖదర్శనం అధికతర సుందరంగా ఉండి స్వామి ముఖంలోనే కళలన్నీ పుట్టుక వచ్చినట్లున్నది.

ఆ జగదేకపతి దివ్యమంగళవిగ్రహంపైన జల్లిన కర్పూర ధూళి రాలి కొంత నలుగడలా చిందినది. ఆ విశేషం స్వామి తన వక్షస్థలంపైన ఆ చంద్రునివంటి ముఖంగల శ్రీభామను నిలుపుకొన్నందున, ఆమె ముఖచంద్రుడు దట్టమైన వెన్నెలలు దిగబోసినట్లు, వర్షించినట్లు ఉన్నది.

స్వామికి మెరుగు జెక్కులపై పూసిన తట్టుపునుగు (సుగంధతైలం) యిరువైపుల జెక్కుల నుండీ కరిగి జారుచున్నది. అది ఆ స్వామి గజగమనవైభవం గలవాడు కాబట్టి, మోహపు మదం అతిశయించి యిరుగడలా స్రవించే గజరాజు చెలువు ఒప్పినది.

శ్రీవేంకటేశ్వరుని మేను పునుగుతైలపు పూతలో జల్లిన కర్పూరగంధవొడితో నిగనిగలాడుచున్నది. ఆ సమయాన (స్వామికి) అలకరించిన సింగారపు సొమ్ములు, అలమేల్మంగ హారం (మంగతాళి) ఇత్యాదులు ధరించగా వెలుగులు చిమ్ముతున్న ఆ దివ్యవిగ్రహముతాను. ప్రకాశకాంతివంతమైన కనకాంగి అలమేల్మంగతో కలిసి విద్యుల్లతా మేఘములు (మెరుపు మేఘము ఒకదానితోనొకటి మేళవించి మెరస్తున్నట్లునదట.)